క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంపై విచారణ



విచారణ చేపడుతున్న ఎంఈఓ మణికుమార్

పాతపట్నం: తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం సరిగా లేదని విద్యార్థుల ఆరోపణలపై ఎంఈఓ మణి కుమార్, ఎస్ఐ కామేశ్వరరావు సోమవారం విచారణ చేపట్టారు. హెచ్ఎం అగతమూడి రమేష్ సమక్షంలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో వారి తరగతి గదులకు వెళ్లి మాట్లాడారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థులు చెప్పారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన సమయంలో పూర్వపు విద్యార్థులకు పాఠశాలలోనికి రావద్దని ఉపాధ్యాయులు నిరాకరించడంతోనే ఆరోపణలు చేస్తున్నారని, పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. సర్పంచ్‌లు బెనియా వెంకటరమణ, అన్నెపు ఉమామహేశ్వరరావు, పెట్ల మన్మథరావు, జి.గోవింద్, సుదర్శనరావు, డి.రాంబాబు, చంద్రరావు పాల్గొన్నారు.

ఏ.ఎస్.కవిటిలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు శ్రీధర్

పాతపట్నం: మండలంలోని ఏ.ఎస్.కవిటి గ్రామంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతోపాటు మంచం పట్టిన రోగులు, బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ చిన్నారులకు, అవసరమైన వారికి మందులను అందజేశారు. ఏఎన్ఎం కల్యాణి, సచివాలయ ఉద్యోగులు, ఆశ వర్కలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

పాతపట్నం: ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న బుయ్యాల చిట్టిబాబు బంగ్లాలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని, పోర్టులు, రైల్వే జోన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పరిశీలకుడు పైడి వెణుగోపాల్, జిల్లా సెక్రటరీ సలాన రాఘవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుక్క శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి

సరుబుజ్జిలి: పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో విద్యార్థులపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తకోట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం టి.జయలక్ష్మి తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలంటే భయంలేకుండా సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు గోపి, రాజారావు, పార్వతీశం, ధనలక్ష్మి, సుజాత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని సోమరాజపురం, గురండి, బమ్మిడి గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావడంపై ఎంపీడీఓ పావనికి వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామ సచివాలయాలను ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిమిత్తం సందర్శించామన్నారు. సోమరాజపురంలో కేవలం ఇద్దరు, గరుండిలో ఒకరు, బమ్మిడిలో ముగ్గురు సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. వీఆర్వో, సర్వేయర్‌లు రీ సర్వేలో ఉన్నట్లు విధుల్లో ఉన్న ఉద్యోగులు తెలిపారన్నారు. మిగిలిన ఉద్యోగులు కొందరు సెలవు పెట్టారన్నారన్నారు. కొంతమంది ఉద్యోగులు ముఖ హాజరు వేసుకుని ఇతర పనులపై బయటకు వెళ్లారన్నారు. సాయంత్రం మూడు గంటలకు స్పందన నిర్వహించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. నిర్వహించడం లేదన్నారు. బమ్మిడిలో పూర్తిగా పంచాయతీ కార్యదర్శి హాజరు కాలేదన్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ఎల్.ఎన్.పేట/హిరమండలం: భూసారం కాపాడుకునేందుకు నవధాన్యాల సాగుతో ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు డివిజన్ యాంగర్ బాబాజీ అన్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేటలో, హిరమండలం మండలంలోని గులుమూరు పంచాయతీల్లో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్టతోపాటు పలు రకాల పంటలు వేసుకుని పొలంలో దుక్కి చేయటం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు.

కర్బూజా సాగు..

లాభాలు బాగు



సుమంతాపురం ప్రాంతంలో కర్బూజా సాగు

- పాతపట్నం నియోజకవర్గంలో సుమారు 500 ఎకరాల్లో సాగు
- అనుకూలించిన వాతావరణ పరిస్థితులు
- వేసవిలో కర్బూజాదే అగ్రస్థానం

ఎల్.ఎన్.పేట: వేసవి తాపన్ని తీర్చే కర్బూజాకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల పక్కన కర్బూజా వ్యాపారులు అధిక సంఖ్యలో ఉంటారు. ఈ ఏడాది వాతావరణ పరస్థితులు అనుకూలించటంతో పాతపట్నం నియోజకవర్గంలో 500 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తున్నారు.

మూడు, నాలుగు నెలల్లో పంట..

ఖరీఫ్ వరి కోత కోసిన తరువాత పొలాన్ని మెత్తగా దుక్కి చేసి బాగా కుల్లిన గత్తం వేసి నీటితడిని కడతారు. పదునుకు మరోసారి దుక్కి చేస్తారు. ఇలా పొలం మెత్తగా దుక్కిచేసి నీటి తడికట్టి డిసెంబర్, జనవరి నెలల్లో విత్తనాలు వేసుకుంటారు. విత్తనాలు వేసిన మూడు, నాలుగు నెలల్లో పంట కోతకు వస్తుంది. విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, విత్తనాలు వేసుకోవటం, ప్రభుత్వం అందించే రాయితీలను పొందటం కోసం రైతులకు ఉద్యాన శాఖ ఉద్యోగులు అవగాహన కల్పిస్తున్నారు. సాగునీరు, ఎరువుల, పురుగుల మందుల యాజమాన్య పద్ధతులే దిగుబడికి కీలకం.

పాతపట్నం నియోజకవర్గంలో కర్బూజా సాగువిస్తీర్ణం..

మండలం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
ఎల్.ఎన్.పేట	105
పాతపట్నం	115
కొత్తూరు	145
మెళియాపుట్టి	75
హిరమండలం	65

నియోజకవర్గంలో

నియోజవర్గంలోని వంశధార, మహేంద్రతనయ నదీ తీర గ్రామాల ఇసుక పొలాల్లో కర్బూజా సాగు చేస్తారు. సుమంతాపురం, దబ్బపాడు, శ్యామలాపురం, బరటాం, సిద్ధాంతం, నివగాం, మాతల, ఆకులతంపర, రామకృష్ణాపురం, కమలమ్మకొట్టులతో పాటు పలు గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గత పదేళ్లుగా కర్బూజా సాగుచేస్తూనే అధిక దిగుబడులు, లాభాలను పొందుతున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగిందని ఆయా గ్రామాల రైతులు, ఉద్యాన శాఖ అధికారులు చెపుతున్నారు.

ఐదేళ్లుగా సాగు..



కర్బూజా సాగును ఐదేళ్లుగా చేస్తున్నాం. వ్యాపారులే పొలం వద్దకు వ్యాన్లు తీసుకువచ్చి కొనుగోలు చేసుకుంటారు. అప్పుడున్న మార్కెట్ ధరకు అమ్ముకోవచ్చు. కరోనా, లాక్‌డౌన్‌ల సమయంలో పంట అమ్ముకునేందుకు ఇబ్బంది పడ్డాం. ఇప్పుడా పరిస్థితి లేదు. పెట్టుబడి పోను ఎకరాకు రూ.30 వేలు లాభం వస్తుంది.

పిల్లా కేశవరావు, రైతు, సుమంతాపురం, ఎల్.ఎన్.పేట

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



కర్బూజా సాగుపై రైతులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను సాధించే దిశగా ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు చేస్తున్నాం. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది.

తమ్మినేని విమల, వీహెచ్ఓ, ఎల్.ఎన్.పేట

2.26 లక్షల పశువులకు గాలికుంటు టీకాలు

- డీడీ వి.జయరాజు



జలుమూరు: వాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీడీ జయరాజు

జలుమూరు: జాతీయ గాలికుంటు వ్యాధి నివారణలో భాగంగా టెక్కలి డివిజన్ పరిధిలో గల 16 మండలాల్లో 2.26 లక్షల పశువులకు టీకాలు వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ డీడీ వి.జయరాజు అన్నారు. సోమవారం జలుమూరు పశువైద్యశాలలో పశువులకు టీకాలు వేశారు. ఇప్పటివరకు సుమారు 40 వేల పశువులకు టీకాలు వేశామన్నారు. 261 మంది సిబ్బంది సిబ్బంది టీకాలు వేస్తున్నారన్నారు. ఏడీ ఎం.లోకనాథం, వైద్యులు ఎం.దీప్తి, ఏహెచ్‌లు ఎల్.అరుణ్, పి.సురేష్ కుమార్, సిబ్బంది శాంతారావు, రైతులు పాల్గొన్నారు.

సారవకోట: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని టెక్కలి డివిజన్ పశుసంవర్ధక శాఖ డీడీ వి.జయరాజ్ సూచించారు. మండలంలోని వెంకటాపురంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు ఉంటుందన్నారు. వీహెచ్ఏలు భైరి ప్రదీప్, మెండ రామ్మోహన్ ఉన్నారు.

వైద్యశిబిరాలు వినియోగించుకోవాలి

సరుబుజ్జిలి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలు పాడి రైతులు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, కొత్తకోట ఎంపీటీసీ సురవరపు సింహాచలం తెలిపారు. సోమవారం కొత్తకోటలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు వైద్య సిబ్బంది వ్యాధి నివారణ టీకాలు వేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఆమదాలవలస: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ బి.శాంతి

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు 43ఎ, 44, 45లను ఆర్డీఓ బి.శాంతి సోమవారం పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సూచించారు. తహసీల్దారు ఎస్.గణపతి, ఎన్నికల డీటీ మురళీధర్ నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: ఖాళీ ఏర్పడిన తెలికిపెంట, చినకాగితాపల్లి ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనునండటంతో పోలింగ్ స్టేషన్ల ప్రాథమిక గుర్తింపు ప్రక్రియ నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పీవీ మురళీ మోహన్‌కుమార్ సోమవారం వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నామని ప్రకటించారు. ఈ నెల10 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు.

బూర్జ: మండలంలో అల్లెన ఎంపీటీసీ స్థానానికి జరగనున్న ఎన్నికకు సంబంధించిన తుది ఓటర్ల జాబితా సిద్ధం చేశామని ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు తెలిపారు. ఈ మేరకు అల్లెన, తుడ్డలి, డొంకలపర్తి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహణపై చర్చించేందుకు సమావేశం ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

శ్రీముఖలింగంలో కామదహనోత్సవం



కామదహనోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: డోలోత్సవం పురస్కరించుకుని శ్రీముఖలింగేశ్వరాలయంలో సోమవారం కామదహనోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి తిరువీధి నిర్వహించారు. మహిళలు స్వామివారికి హారతులు ఇచ్చారు. ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కరకవలస డీలర్‌పై 6ఏ కేసు నమోదు

జలుమూరు: కరకవలస డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ ఆర్.అప్పల నాయుడు సోమవారం తెలిపారు. రేషన్ డిపోలో క్షేత్రస్థాయిలో ఉండాల్సిన సరుకులకు, ఈ-పాస్‌లో ఉండాల్సిన వాటికి తేడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సీఎస్‌డీటీ గణేష్, సిబ్బంది ఉన్నారు.

నివేదికలు సిద్ధం చేయాలి

పొందూరు: స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధించి తీసుకున్న చర్యల నివేదిక (ఏటీఆర్)లు మండల స్థాయి అధికారులు సిద్ధంగా ఉంచాలని తహసీల్దార్ ఎస్.రాంబాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలపై అధికారులకు వినతులు అందాయి. ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళి, ఎంఈఓ పి.వి.రామరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



నరసన్నపేట: మాట్లాడుతున్న సివిల్ జడ్జి సి.హరిప్రియ

నరసన్నపేట: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నరసన్నపేట సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. స్థానిక కోర్టులో జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మహిళా పోలీసులకు అవగాహన సదస్సును న్యాయాధికారి సంస్థ రీసోర్స్ పెర్సన్లు సరళకుమారి, విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సివిల్ జడ్జి మాట్లాడుతూ ప్రధానంగా చదువుపై దృష్టి పెట్టాలని, ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. నరసన్నపేట సీఐ డి.రాము, ఎస్ఐ సింహాచలం పాల్గొన్నారు.

కొత్తూరు: మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాలపై విద్యార్థి దశనుంచి అవగాహన ఉండాలని కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, పలువురు న్యాయవాదులు అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మండలంలోని వసప గ్రామంలో ఉన్న కేజీబీవీలో చదువుతున్న బాలికలను ఉద్దేశించి న్యాయ విజ్ఞాన సదస్సును జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే ఇతరల నుంచి మోసానికి గురికాకుండా ఉంటారన్నారు. బాల్య వివాహాలు, దిశ చట్టం, గృహ నిర్బంధం, వరకట్న వేదింపులతో పాటు పలు రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు రాడ రాజు, సీహెచ్ రవి కిరణ్, ధర్మారావు, ప్రసాదరావు, ఫల్గుణరావు, నూక రాజు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



జలుమూరు: సినీ గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థులు



పోలాకి: నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

జలుమూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రామకృష్ణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.శోభారాణి అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పదో తరగతి కీలకమన్నారు. విద్యార్థులు పలు సినీ గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ఎ.కృష్ణప్రకాశ్, సీహెచ్ వెంకటేశ్వరులు, కేవీ సుధాకరరావు, కె.శాంతామణి, బి.హైమావతి, ఎన్.శశిరేఖ, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోలాకి: విద్యతోపాటు అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని ఈదులవలస ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పి.ప్రవీణ అన్నారు. సోమవారం పాఠశాలలో ఫేర్‌వెల్ డే నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ

నరసన్నపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్ కాంగ్రెస్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు విజ్ఞప్తి చేశారు. సదాశివుని కృష్ణ, పొట్నూరు సాయిప్రసాద్, అధికార్ల సాంబమూర్తి సోమవారం నరసన్నపేటలో విలేకర్లతో మాట్లాడారు. విశాఖను పాలనా రాజధాని చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని చర్యలూ తీసుకుంటున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీతంరాజు విజయం చాలా అవసరమన్నారు. సీతంరాజుకు పూర్తి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కణితి కృష్ణారావు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు



వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీతులసి

కొత్తూరు: ఆస్పత్రికి వస్తున్న రోగులకు సకాలంలో వైద్యం అందించాలని టెక్కలి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీతులసి అన్నారు. కురిగాం పీహెచ్‌సీ సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు రకాల పథకాలు అమలు చేయడంతోపాటు లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఆరోగ్య కార్యకర్త తన పరిధిలో ఉన్న ప్రతి కుటుంబ సభ్యుడి ఆరోగ్యంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం బలద గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంపై అమరావతి నుంచి వచ్చిన బృందం డాక్యుమెంటరీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, సందీప్ కుమార్, ఈఓ బుజ్జిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ఆమదాలవలస రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, దీన్ని ప్రోత్సహించివారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ అన్నారు. మండలంలోని కొత్తవలసలో సోమవారం రాత్రి స్ఫూర్తి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాల్యవివాహాలు జరిపేందుకు ఎవరైనా నిశ్చయిస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన తమ్మినేని చిరంజీవినాగ్



పోలాకి: రహిమానుపురంలో ప్రచారం నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: కర్లెమ్మ సచివాలయం సిబ్బందిని కలిసి ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: వెదుళ్లవలసలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్



బూర్జ: కొరగాంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు కోరారు. సోమవారం ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువతను కలిసి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. సుధాకర్ విజయం ద్వారా ఉత్తరాంధ్ర తరపున విశాఖ రాజధాని అంశాన్ని మరింత బలంగా వినిపించవచ్చునన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: భరణికోటలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పాతపట్నం: కాగువాడ గ్రామ సచివాలయంలో ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: రావిచెంద్రిలో ప్రచారం నిర్వహిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు



హిరమండలం: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: బొంతలవీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు